కౌంటింగ్‌కు వేళాయే

- నేడు సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు
- 20 రౌండ్లలో తేలనున్న కందుకూరు ఫలితం, 14 టేబుల్స్ ఏర్పాటు
- గెలుపోటములపై అందరిలోనూ తీవ్ర ఉత్కంఠ


ప్రియదర్శిని కాలేజీలో ఓట్ల లెక్కింపు కేంద్రంలో పూర్తయిన ఏర్పాట్లు

కందుకూరు: దాదాపు 21 ఒక్క రోజుల ఉత్కంఠకు నేటితో తెరపడనుంది. మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం నరాల తెగితే ఉత్కంఠతో ఎదురుచూస్తున్న యావత్తు ప్రజానీకానికి ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో నేటితో తేలిపోనుంది. అదే సందర్భంలో మంగళవారం నెల్లూరులో జరిగే ఓట్ల లెక్కింపుతో కందుకూరు నియోజకవర్గ ఫలితం కూడా బహిర్గతం కానుంది. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీల నేతలతో ఫలితంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గెలుపు మాదంటే, మాదంటూ ఎవరికి వారు లెక్కలు వేసుకుంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే వైఎస్సార్ సీపీకి కంచుకోట లాంటి కందుకూరు నియోజకవర్గంలో వరుసగా మూడవసారి వైఎస్సార్ సీపీ విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేయడం ఖాయమంటూ రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు.

20 రౌండ్లలో తేలనున్న కందుకూరు ఫలితం

కందుకూరు నియోజకవర్గ సార్వత్రిక ఓట్ల లెక్కింపు ప్రక్రియ నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్‌లో కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో జరుగుతుంది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం 20 రౌండ్ల వరకు కొనసాగనుంది. ఈ మేరకు మొత్తం 14 టేబుళ్లు ఏర్పాటు చేసిన అధికారులు రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఉదయం మొదట పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు అనంతరం ప్రధాన ఈవీఎం ఓట్లను లెక్కించనున్నారు. మొదటి బూత్ అయిన వలేటివారిపాలెం మండలం నుంచి నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మొదట వలేటివారిపాలెం, తరువాత లింగసముద్రం, ఆ తరువాత కందుకూరు పట్టణం, కందుకూరు మండలం ఓట్ల లెక్కింపు జరనుంది. వీటి తరువాత గుడ్లూరు మండలం, ఉలవపాడు మండలాలకు చెందిన ఓట్ల లెక్కింపు చివరిలో జరుగుతుంది. ఈ మొత్తం ప్రక్రియ మంగళవారం సాయంత్రం వరకు కొనసాగే అవకాశం ఉంది. అయితే మధ్యాహ్నం నాటికి ఫలితాలపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రూ. కోట్లలో బెట్టింగ్‌లు

ఎన్నికల అనంతరం గెలుపోటములపై రెండు పార్టీల్లోని నాయకులు ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. మండలాల వారీగా పోలింగ్ సరళిపై లెక్కలు వేసుకుని గెలుపు మాదంటే మాదంటూ జోరుగా బెట్టింగ్‌లు వేసుకుంటున్నారు. గత 20 రోజుల వ్యవధిలో నియోజకవర్గంలో ఇరుపక్షాల నుంచి భారీగా బెట్టింగ్‌లు పెట్టినట్లు సమాచారం. కందుకూరు ఎమ్మెల్యే ఫలితంతో పాటు, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే అంశంపై కూడా జోరుగా బెట్టింగ్‌లు పెట్టారు.

వైఎస్సార్ సీపీకి హ్యాట్రిక్ విజయమే..

నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ సరళిపై ఇప్పటికే విశ్లేషణలు పూర్తయ్యాయి. మండలాల వారీగా లెక్కలు కట్టిన పలువురు సీనియర్ రాజకీయ విశ్లేషకులు వరుసగా మూడవసారి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుదంటూ చెప్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం తరువాత వరుసగా 2014, 2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. అదే పరంపర 2024 ఎన్నికల్లోనూ పునరావృత్తమవుతుందని ప్రతిఒక్కరూ భావిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ తరుపున పోటీ చేసిన బుర్రా మధుసూదన్‌యాదవ్ కందుకూరు ఎమ్మెల్యేగా ఖచ్చితంగా గెలుస్తారని లెక్కలు వెలువడ్డాయి. ఈ ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పాటు పోలింగ్ సరళి కూడా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మహిళా ఓటర్లు, గ్రామీన ఓటర్లు అధికంగా ఉండడం పలు వర్గాల ప్రజలు పూర్తిగా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండడంతో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమనే ధీమా వ్యక్తమవుతుంది. అదే సందర్భంలో గత 20 ఏళ్లుగా వరుసగా ఓడిపోతూ వస్తున్న తెలుగుదేశం పార్టీలోకి మరోసారి నిరాశ తప్పదనే అభిప్రాయం ప్రతి ఒక్కరిలోను వ్యక్తమవుతుంది.

భారీ మెజార్టీపై ఆశలు

కందుకూరు నియోజకవర్గ చరిత్రలో 2019 ఎన్నికల్లో మాత్రమే ఏకపక్షంగా వైఎస్సార్ సీపీకి భారీ మెజార్టీ వచ్చింది. ఒక్క వలేటివారిపాలెం మండలం మినహా మిగిలిన అన్ని మండలాల్లోను వైఎస్సార్ సీపీ ప్రభంజనం కనిపించింది. అదే కోవలో ముగిసిన పోలింగ్ సరళిని బట్టి చూస్తే మరోసారి నియోజకవర్గంలో భారీ మెజార్టీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు వస్తుందంటూ అంచనాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో 2,28,913 ఓట్లు ఉంటే 2,03,637 ఓట్లు ఈ ఎన్నికల్లో పోలయ్యాయి. పోలింగ్‌శాతం 88.96 శాతంగా నమోదైంది. గత ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరగడం గమనార్హం.

తీర్పు నేడే

కనిగిరి రూరల్: 2024 సార్వత్రిక ఎన్నికల ఘట్టం మంగళవారంతో ముగియనుంది. మే 13న ఎన్నికల పోలింగ్ జరగ్గా, సుమారు 21 రోజుల తర్వాత జూన్ 4న మంగళవారం లెక్కింపు జరగనుంది. ఈమేరకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. కనిగిరి నియోజకవర్గ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల లెక్కింపు ఒంగోలు లోని రైజ్ గాంధీ కృష్ణా కాలేజీలోని రెండో అంతస్తులో జరగనుంది. కనిగిరి నియోజకవర్గంలోని 297 పోలింగ్ బూత్‌లలో 2,04,315 ఓట్లు పోల్ కాగా, పోస్టల్ బ్యాలెట్‌లు, హోం, సర్వీసు బ్యాలెట్లు మొత్తం 2,807 పోలైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం కలిపి 2,07,122 ఓట్లు లెక్కింపు జరగనున్నాయి. 14 టేబుళ్లు, 22 రౌండ్‌లలో లెక్కింపు ప్రక్రియ జరుగుతుంది. ఉదయం 8 గంటల నుంచే లెక్కింపు ప్రారంభం అవుతుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించనున్నారు. అరగంట తర్వాత తొలి రౌండ్ ఫలితాలు వెల్లడి కానున్నట్లు తెలిసింది. కనిగిరి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు హెచ్‌ఎంపాడు మండల పోలింగ్ బూత్‌ల నుంచి ప్రారంభమై.. పామూరు మండల పోలింగ్ బూత్‌లతో ముగియనుంది.

టెన్షన్.. టెన్షన్..

నిన్నటి వరకు గెలుపుపై ఎవరికి వారు ధీమాలో ఉన్న అభ్యర్థుల్లో లెక్కింపు సమయం దగ్గర పడే కొద్ది వారిలో టెన్షన్ నెలకొంది. మరో కొద్ది గంటల్లో అభ్యర్థుల భవితవ్యం ప్రజా తీర్పుతో తేలనుంది. కనిగిరి నియోజవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా మళ్లీ ఎగరేస్తామని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు.

క్లుప్తంగా

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల తరలింపు


ప్రత్యేక వాహనంలో పోస్టల్ బ్యాలెట్లను తరలిస్తున్న ఆర్‌ఓ కుమార్, సిబ్బంది

కొండపి(సింగరాయకొండ): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొండపి నియోజకవర్గానికి చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కొండపిలోని స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ కేంద్రమైన రైజ్ కళాశాల కు సోమవారం ప్రత్యేక వాహనంలో తరలించినట్లు రిటర్నింగ్ అధికారి ఎ.కుమార్ తెలిపారు. పోలీస్ బందోబస్తు మధ్య కౌంటింగ్ కేంద్రానికి తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా చేయాలి


దివ్యాంగుల సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓలు

పీసీపల్లి: మండలంలో జరుగుతున్న దివ్యాంగుల గుర్తింపు సర్వేను పారదర్శకంగా జరగాలని ఎంఈఓలు జి.సంజీవ్, ఆర్ శ్రీనివాస రావు అన్నారు. మండలంలో జరుగుతున్న దివ్యాంగుల గుర్తింపు సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 18 మంది దివ్యాంగులను గుర్తించాలని, ఇంకా ఎవరైనా మాటలు, వినికిడి, మందబుద్ధి ఉన్న వారు ఉంటే వెంటనే ఐఆర్‌టీ టీచర్ల వివరాలు అందించాలన్నారు. మండలంలోని దివ్యాంగుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9848625109, 9505988621 నంబర్లకు సంప్రదించాలని కోరారు. నాగేశ్వరరావు, శ్వేషిక ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొండపి(సింగరాయకొండ): విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొండపి గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పుస్తక పఠనం ప్రతి ఒక్కరినీ మంచి మార్గంలో నడిపి మంచి ప్రవర్తన తీసుకొస్తుందని తెలిపారు. విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో యోగా, మెడిటేషన్ నిర్వహించారు. యోగా, మెడిటేషన్‌తో మానసిక ఉల్లాసం, ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. శిక్షణలో 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఉలవపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు నిర్వహించే శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు జరిపారు. నేటి సమాజంలో గ్రంథాలయాలు వాటి పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొత్తం 42 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.

విజయం వైఎస్సార్ సీపీదే


మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్


పాల్గొన్న కౌంటింగ్ ఏజెంట్లు

- ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి
- కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సామరస్యంగా సాగేలా ఏజెంట్లు సహకరించాలి
- కనిగిరి కొండపై మళ్లీ జెండా ఎగరేద్దాం
- వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే వైఎస్సార్ సీపీ ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లు, ఓర్పు, సహనంతో ఉండాలన్నారు. ప్రతి టేబుల్ వద్ద ఏజెంట్లు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సామరస్యంగా జరిగేలా వైఎస్సార్ సీపీ ఏజెంట్లు సహకరించాలన్నారు. వైఎస్సార్ సీపీ అంటే క్రమశిక్షణ ఉన్న పార్టీ అని, కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లు క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. తప్పులు జరుగుతుంటే వెంటనే గుర్తించి ఎన్నికల అధికారులకు తక్షణం ఫిర్యాదు చేయాలే తప్ప కౌంటింగ్ వద్ద ఎటువంటి గొడవలు, ఘర్షణలకు దిగవద్దని హితవు చెప్పారు. ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అందరూ సహకరించాలని విన్నవించారు.

వైఎస్సార్ సీపీదే విజయం

ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా న్యాయం, ధర్మం గెలుస్తోందని వైఎస్సార్ సీపీ విజయదుంభి మోగిస్తోందని డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారని, సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట్లో లబ్ధి చేకూరిందన్నారు. ఈ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకే మద్దతు పలికారని, ఓటు రూపంలో తమ అభిమానాన్ని చాటుకున్నారని వివరించారు. మరోసారి వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. కనిగిరి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తున్నామని స్పష్టం చేశారు. కనిగిరి కొండపై మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తున్నామని తెలిపారు. పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఎంపీపీలు రామన తిరుపతిరెడ్డి, మూడమంచు వెంకటేశ్వర్లు, గాయం బలరాంరెడ్డి, సూరసాని సర్సారెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, ఓమోగా రామిరెడ్డి, దాదిరెడ్డి మాల కొండారెడ్డి, విద్య యాదవ్ తదితరులున్నారు.

భైరవకోనలో దద్దాల దంపతుల ప్రత్యేక పూజలు


భైరవకోనలో దద్దాల దంపతులకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు


వెంకటేశ్వరస్వామి గుడిలో పూజలు చేస్తున్న దద్దాల నారాయణ దంపతులు

సీఎస్‌పురం(పామూరు):

ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, మంజుభార్గవి దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రంలో మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావాలని, కనిగిరిలో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ భైరవేశ్వర, త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో స్వామివార్లకు అభిషేకం, అమ్మవారికి కుంకుమపూజ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివార్లకు పూజల్లో వినియోగించే పూల మొక్కలు నాటారు. అనంతరం దద్దాల నారాయణయాదవ్, మంజుభార్గవి దంపతులకు అర్చకులు వేద ఆశీర్వచనంచేసి తీర్థ ప్రసాదాలు అందించగా ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, వెంకటరెడ్డి స్వామి, అమ్మవార్ల శేష వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ముందుగా వారిని అర్చకులు, ఆలయ చైర్మన్ ఘనంగా సన్మానించారు. ఉపసర్పంచ్ షేక్ ఇమామ్‌సాహెబ్, ఆలయ కమిటీ సభ్యుడు గంధం వెంకటాద్రి, బసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: పట్టణంలోని పలు దేవాలయాల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్, దద్దాల మంజు భార్గవి దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని కోరారు.

కనిగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించాలని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని వెంకటేశ్వర స్వామి గుడిలో, సాయిబాబా దేవస్థానంలో విశిష్ట పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలు, సంబరాలపై నిషేధం


పామూరు: వైఎస్సార్ సెంటర్‌లో మానవహారంను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై

కొండపి(సింగరాయకొండ): ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు నిషేధించినట్లు కొండపి సీఐ వై.పాండురంగారావు తెలిపారు. కొండపి సర్కిల్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కొండపి సర్కిల్ పరిధిలోని కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎన్నికల ఫలితాల తరువాత ప్రజలు గుంపులుగా ఉండటం, బాణసంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడంపై ఆంక్షలు ఉన్నాయన్నారు. కొండపి సర్కిల్ పరిధిలో వ్యాపార సంస్థలు, దుకాణాలు మంగళవారం స్వచ్ఛందంగా మూసివేసి పోలీస్ వారికి సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మర్రిపూడి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని ఎస్సై సీహెచ్ శివబసవరాజు కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా ఉండటం, బాణసంచా కాల్చడం, రంగులు చల్లుకోవడం, ర్యాలీలు నిర్వహించడం నిషేధమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టంగుటూరు: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై పున్నారావు హెచ్చరించారు. మండలంలోని అన్ని వ్యాపార సంస్థలు, షాపులు స్వచ్ఛందంగా 5వ తేదీ ఉదయం వరకు మూసివేయాలని కోరారు. టంగుటూరులో దుకాణాలను సోమవారం సాయంత్రం పోలీసులు మూత వేయించారు.

పామూరు: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో 144 సెక్షన్, 30 యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్సై ఎం సైదు బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన పామూరులోని ప్రధాన వీధుల్లో ప్రత్యేక బలగాలతో ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా కందుకూరు బస్టాండ్ సెంటర్‌లో ప్రత్యేక బలగాలతో మానవహారం నిర్వహించారు. ఎస్సై సైదుబాబు మాట్లాడుతూ అత్యవసర సేవలు వైద్యం, తాగునీరు మినహా ఇతర దుకాణాలు పూర్తిగా మూసివేయాలన్నారు. గుంపులు గుంపులుగా ఉండటంగాని, బాణసంచా కాల్చడంగాని, వీధుల వెంట సంబరాలు చేసుకోవడం, రంగులు చల్లుకోవడం, సోషల్ మీడియాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడంగాని పూర్తిగా నిషేదించినట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం, రేపు బుధవారం 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని కనిగిరి సీఐ దాసరి వెంకటేశ్వరరావు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఎస్‌పురం, డీజీపేట, కొండబోయినపల్లి గ్రామాల్లో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కనిగిరి సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శాంతి భద్రతల దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం మండలంలో అత్యవసర సేవలు మినహా అన్ని దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. 144 సెక్షన్ అమలులో ఉన్న దృష్ట్యా ఎవ్వరు గుంపులుగా ఉండరాదన్నారు. ఎక్కడైన అల్లర్లకు పాల్పడ్డా, వివాదాస్పద వ్యాఖ్యలు చేసినా, రెచ్చగొట్టే విధంగా మాట్లాడినా, బాణసంచా కాల్చినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై బి.ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పీసీపల్లి: ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఈ నెల 3 నుంచి 5 వరకు మండలంలో 144 సెక్షన్ విధించామని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రమేష్‌బాబు అన్నారు. కౌంటింగ్ దృష్ట్యా మండలంలో షాపులు తీయవద్దని, ఏదైనా అత్యవసరం తప్పితే ఎవరూ బయటకు రాకూడదన్నారు. ఎక్కడైనా ఒకరికన్నా ఎక్కువ మంది గుంపులుగా ఉంటే వారిని అరెస్టు చేస్తామన్నారు. గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా సంయమనంతో ఉండాలన్నారు.


సీఎస్‌పురంలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు


డి.జి.పేటలో మార్చ్ నిర్వహిస్తున్న సీఐ, ఎస్సైలు

అనధికారికంగా పొగాకు బ్యార్న్‌లు నిర్మించొద్దు

టంగుటూరు: రైతులు టుబాకో బోర్డు అనుమతి లేకుండా పొగాకు బ్యార్న్‌లు నిర్మించరాదని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ.332 పలికింది. ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పాలేటిపాడు, జయవరం గ్రామాల రైతులు 1017 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 965 కొనుగోలయ్యాయి. కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.282.70 పలికింది. వేలంలో మొత్తం 40 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి తెలిపారు.

కొండపిలో సరాసరి ధర రూ.279.07


కొండపిలో వేలం నిర్వహిస్తున్న సునీల్‌కుమార్

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ.279.07 పలికిందని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. ధర్మవరం, కోయవారిపాలెం,వెంకటకృష్ణాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం గ్రామాల రైతులు 1172 బేళ్లు తీసుకురాగా వాటిలో 1072 కొనుగోలయ్యాయి. గరిష్ఠ ధర రూ.331, కనిష్ఠ ధర రూ.205 పలికింది. వేలంలో 21 మంది వ్యాపారులు పాల్గొన్నారు. మంగళవారం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా వేలానికి సెలవు ప్రకటించినట్లు వెల్లడించారు.

ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల గుర్తింపునకు సర్వే


కెల్లంపల్లిలో ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులను గుర్తిస్తున్న అధికారులు

మర్రిపూడి: భవిత కేంద్రాల్లో దివ్యాంగ విద్యార్థులకు మంచి భోదనతోపాటు జీవన నైపుణ్యాలను అలవర్చుతారని ఎంఈఓ ఎంవీ రంగయ్య తెలిపారు. మండలంలోని కెల్లంపల్లి, మర్రిపూడి గ్రామాల్లో ప్రత్యేక అవసరాలుగల పిల్లల కోసం సోమవారం చేపట్టిన సర్వేలో ఎంఈఓ రంగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవిత కేంద్రాల రిసోర్స్ టీచర్స్ హరిబాబు, మాలకొండమ్మ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలోని పలు గ్రామాల్లో 25 మంది దివ్యాంగ చిన్నారులను గుర్తించామన్నారు. సర్వే ఈ నెల 9వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్రతి బుధవారం ఫిజియోథెరపీ, శారీరక వ్యాయాయం అందిస్తామన్నారు. అలాగే బుద్ధిమాంద్యం కలిగిన చిన్నారులు వారి ఇంటి వద్దకు వెళ్లి ప్రతి శనివారం హోంబేస్ ఎడ్యుకేషన్ అందిస్తామన్నారు.

వైభవంగా గంగాభవాని గ్రామోత్సవం


విశిష్ట అలంకరణలో గంగాభవాని మూలవిరాట్ బొల్లావులు


గంగాభవాని ఉత్సవమూర్తికి గ్రామోత్సవం

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద ఉన్న గంగాభవాని వార్షిక తిరునాళ్లలో భాగంగా రెండో రోజు సోమవారం గంగాభవాని ఉత్సవమూర్తిని గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోళతాళాల నడుమ గ్రామోత్సవం మోపాడు, మోపాడు బంగ్లా, పుట్టంనాయునిపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ముందుగా గంగాభవాని అమ్మవారి మూల విగ్రహమూర్తికి అర్చకులు అభిషేకం, కుంకుమపూజతో పాటు విశిష్ట పూజలు చేశారు. ఆలయప్రాంగణంలో బొల్లావులకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.